

# ఈవీల ఉత్పత్తికి బ్రేక్!

## చైనా నుంచి ఆగిన రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్

న్యూఢిల్లీ, జూన్ 10: సెమీకండక్టర్ సంక్షోభం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న దేశీయ ఆటో పరిశ్రమను మరో ఉపద్రవం ముంచెత్తబోతున్నాదా! ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇది నిజమేననిపిస్తున్నది. తమ దేశంలో లభించే అరుదైన రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించడంతో ప్రపంచవ్యాప్తంగా వీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడ్డాయి. ఈ తాజా పరిణామంతో వాహన ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపి భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈవీ విస్తరణ లక్ష్యాలను దెబ్బపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశీయ ఆటోమోటివ్ తయారీదారులు ప్రత్యేకంగా ఎలక్ట్రిక్ వాహన ఉత్పత్తిలో నిమగ్నమైన వారు అరుదైన భూ అయస్కాంతాల కొరత కారణంగా ఈ ఏడాది జూలై నాటికి తమ ఈవీ వాహనాల ఉత్పత్తిని నిలిపివేయక తప్పదని పరిశ్రమ వర్గాలు సూచించాయి.

### ఏమిటీ అరుదైన భూ అయస్కాంతం?

అధునాతన వాహనాలు ప్రత్యేకంగా ఎలక్ట్రిక్ వాహనాలు, హైబ్రిడ్‌లకు అరుదైన భూ అయస్కాంతాలు అత్యంత అవసరం. ఎలక్ట్రిక్ మోటర్లు, బ్రేకింగ్ సిస్టమ్, పవర్ స్టీరింగ్, సమర్థవంతంగా పనిచేయడం కోసం బలమైన ఆయస్కాంత శక్తిపై ఆధారపడే ఇతర సిస్టమ్‌లకు ఈ భూ అయస్కాంతం తప్పనిసరి. ప్రస్తుతం ప్రపంచ దేశాలకు 90 శాతానికి పైగా చైనా నుంచే ఇవి సరఫరా అవుతున్నాయి. కొన్ని అరుదైన మిశ్రమ లోహాలు, శాశ్వత ఆయస్కాంతాల ఎగుమతిపై ఈ ఏడాది ఏప్రిల్‌లో చైనా కఠిన నిబంధనలు విధించింది. జాతీయ భద్రతా ఆందోళనల కారణంగా ఈ చర్యలు తీసుకున్నప్పటికీ, అమెరికా విధించిన ప్రతీకార సుంకాలకు ప్రతిస్పందనగా ఈ చర్య తీసుకున్నట్లు స్పష్టమవుతోంది.

# ఈక్విటీ ఫండ్లకు తగ్గుతున్న గిరాకీ

న్యూఢిల్లీ/ముంబై, జూన్ 10: దేశీయ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ల (ఎంఎఫ్)కు గిరాకీ తగ్గిపోయింది. గత నెలలో వచ్చిన పెట్టుబడులు 13 నెలల కనిష్ఠానికి దిగజారాయి. మే నెలలో రూ.19,013 కోట్లకు పరిమితమయ్యాయి. 2024 ఏప్రిల్ తర్వాత ఈ స్థాయిలోనే ఉండటం ఇదే తొలిసారి. నాడు రూ.18,917 కోట్లు వచ్చాయి. కాగా, ఈసారి లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్ ఫండ్స్ అన్నింటిలోకి ఇన్వెస్ట్‌మెంట్లు పడిపోవడం గమనార్హం. మదుపరులు లాభాల స్వీకరణకు దిగడమే కారణమని మార్కెట్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. అలాగే సూచీలు కన్సాలిడేషన్ దశలోకి వెళ్తుండటం కారణమేనంటున్నారు.

### వరుసగా ఐదో నెల


ఈక్విటీ ఫండ్స్‌ల్లోకి పెట్టుబడులు క్షీణించడం వరుసగా ఇది ఐదో నెల. ఇక ఈ ఏడాది ఏప్రిల్‌తో పోల్చితే మే నెలలో దాదాపు 22 శాతం పతనం కనిపిస్తున్నట్టు మంగళవారం భారతీయ మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ (యాంఫీ) తెలిపింది. ఈక్విటీ ఎంఎఫ్‌ల్లోకి నెలవారీగా ఎంతోకొంత పెట్టుబడులు రావడం మాత్రం ఇది (మే) 51వ నెల.

### సిప్‌లకు ఆదరణ

సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌కు ఇన్వెస్టర్లలో ఆదరణ బాగానే కనిపిస్తున్నది. మే నెలలో రూ.26,688 కోట్లు వచ్చాయి. ఏప్రిల్‌లో రూ.26,632 కోట్లుగా నమోదయ్యాయి.

**ఈక్విటీ ఎంఎఫ్‌ల్లోకి నానాటికి క్షీణిస్తున్న పెట్టుబడులు**

| నెల | పెట్టుబడులు (రూ.కోట్లలో) |
|---|---|
| డిసెంబర్ (2024) | 41,156 |
| జనవరి (2025) | 39,688 |
| ఫిబ్రవరి | 29,303 |
| మార్చి | 25,082 |
| ఏప్రిల్ | 24,269 |
| మే | 19,013 |




**మే నెలలో పెట్టుబడుల తీరిది..**

- ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌ల్లోకి అత్యధికంగా రూ.3,841 కోట్ల పెట్టుబడులు.
- ఈక్విటీ ఆధారిత సేవింగ్ స్కీముల నుంచి రూ.678 కోట్ల పెట్టుబడులు ఉపసంహరణ.
- వాల్యూ ఫండ్స్‌ల నుంచి రూ.92 కోట్లు, డివిడెండ్ ఈల్డ్ ఫండ్స్‌ల నుంచి రూ.21 కోట్లు ఔట్.
- లార్జ్‌క్యాప్ ఫండ్స్‌ల్లోకి రూ.1,250 కోట్లు వచ్చాయి. ఏప్రిల్‌లో రూ.2,671 కోట్లు పోయాయి.
- మిడ్‌క్యాప్ ఫండ్స్ నుంచి రూ.2,808 కోట్లు వెనక్కి.
- స్మాల్‌క్యాప్ ఫండ్స్‌ల్లోకి రూ.3,214 కోట్లు రాక.
- రూ.292 కోట్ల పెట్టుబడుల్ని ఆకర్షించిన గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్).
- డెట్ ఫండ్స్‌ల నుంచి రూ.15,908 కోట్లు ఔట్.

## సెన్సెక్స్ లాభాలకు బ్రేక్

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం మిశ్రమంగా ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ నష్టపోగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ స్వల్పంగా లాభపడింది. సెన్సెక్స్ 53.49 పాయింట్లు పడిపోయి 82,391.72 వద్ద ముగిసింది. అయితే 1.05 పాయింట్లు పెరిగి 25,104.25 వద్ద నిఫ్టీ నిలిచింది. నిజానికి అంతకుముందు 4 రోజులపాటు రెండు సూచీలు లాభాల్లోనే స్థిరపడ్డ విషయం తెలిసిందే. దీంతో వరుస లాభాలకు బ్రేక్ పడినట్టైంది. కాగా, ఐటీ, యుటిలిటీస్, పవర్, టెక్నాలజీ, హెల్త్‌కేర్, కమోడిటీస్ షేర్లు పెరిగాయి. రియల్టీ, టెలికం, ఆర్థిక సేవలు తదితర రంగాల షేర్లు నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్ 0.33 శాతం, స్మాల్‌క్యాప్ 0.04 శాతం చొప్పున పెరిగాయి. సెన్సెక్స్ షేర్లలో ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతీ, ఆర్ఐఎల్ షేర్లు నష్టపోయాయి.

## నయా అపాచీ ఆర్‌టీఆర్ 200

### ధర రూ.1,53,900

చెన్నై, జూన్ 10: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ టీవీఎస్ మోటర్ కంపెనీ..తాజాగా 2025 టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 200 4వీ మోటర్‌సైకిల్‌ను పరిచయం చేసింది. అడ్వాన్స్ టెక్నాలజీ, సూపీరియర్ పనితీరు, భద్రత ప్రమాణాలను మెరుగుపరిచి ఈ బైకును తీర్చిదిద్దినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా కంపెనీకివున్న అవుట్‌లెట్లలో లభించనున్న ఈ బైకు ధర రూ.1,53,900గా నిర్ణయించింది. దేశీయ మార్కెట్లోకి అపాచీ బైకులు అడుగుపెట్టి 20 ఏండ్లు పూర్తైనట్టు, ఇప్పటి వరకు 60 లక్షల యూనిట్ల బైకులు దేశీయ రోడ్లపై దూసుకుపోతున్నాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.



## రాష్ట్రంలోకి 2 వేల కోట్ల పెట్టుబడులు

### ముందుకొచ్చిన యూఏఈ కంపెనీలు
### కొత్తగా 5వేల మందికి ఉద్యోగావకాశాలు




హైదరాబాద్, జూన్ 10(నమస్తే తెలంగాణ): పెట్టుబడులు ఆకట్టుకోవడంలో రాష్ట్రం దూసుకుపోతున్నది. తాజాగా యూఏఈకి చెందిన శైవ గ్రూపు, తారనిస్ క్యాపిటల్‌లు సంయుక్తంగా రూ.2,125 కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇందుకు రాష్ట్రానికి చెందిన ఐదు స్థానిక కంపెనీలతో ఈ రెండు అరబ్ సంస్థలు అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. ఈ పెట్టుబడులతో కొత్తగా 5 వేల మందికి పైగా తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. వీటిలో శైవ గ్రూపు, తారనిస్ క్యాపిటల్ సంయుక్తంగా రివిలేషన్ బయోటెక్‌లో రూ.1,360 కోట్లు పెట్టుబడులు పెట్టబోతుండగా.. మనాకిన్ బయో రూ.340 కోట్లు, స్వబోధ ఇన్ఫినిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ అడ్వైజర్స్ రూ.80 కోట్లు, ఎగ్జిజెంట్ డ్రిల్లింగ్ టెక్నాలజీ రూ.90 కోట్లు, యెంత్రా టెక్ కంట్రోల్స్ రూ.255 కోట్ల మేర పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయని మంత్రి చెప్పారు. దీంతోపాటు వచ్చే మూడేండ్లలో బయోటెక్, ఏఐ, డాటా సెంటర్, డిఫెన్స్, ఎనర్జీ, ఫిన్‌టెక్ తదితర రంగాల్లో రూ.24 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు శైవ, తారనిస్ క్యాపిటల్ సంసిద్ధత వ్యక్తం చేసినట్టు శ్రీధర్ బాబు వెల్లడించారు. అలాగే ఈ రెండు సంస్థలు వచ్చే మూడేండ్లలో బయోటెక్ రంగంలో తినుబండారాల్లో చక్కెర శాతాన్ని తగ్గించడం, యాంటీ డయాబెటిక్, ఫుడ్ మేనేజ్‌మెంట ఉత్పత్తులు, ఫోర్త్ సిటీ, ఏఐ సిటీ రంగాల్లోవున్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సంసిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి శైవ గ్రూపు చైర్మన్, సీఈవో అమిత్ జగన్నాథ్ వర్మ, తారనిస్ క్యాపిటల్ సీఈవో నికోలస్ ఎస్.బింగ్ హామ్, రివిలేషన్స్ బయోటెక్ ఎండీ రవిచంద్ర బీరం, మనాకిన్ బయో డైరెక్టర్ జశ్వంత్ ప్రణవ్ యతిరాజం, స్వబోధ ఇన్ఫినిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ అడ్వైజర్స్ సీఈవో సంకర్ష్ చందా, ఎగ్జిగెంట్ డ్రిల్లింగ్ టెక్నాలజీ డైరెక్టర్ పాండురంగా రావు తదితరులు హాజరయ్యారు.

# మోసపూరిత పెట్టుబడులు

- ఎంసీఏలో మనకిన్ బయో నమోదవ్వలేదు
- ఆ సంస్థ రూ.340 కోట్ల పెట్టుబడి అనుమానాస్పదమే
- నష్టాల్లో యెంత్రా టెక్ కంట్రోల్స్
- అయినా రూ.255 కోట్ల పెట్టుబడి?
- బీఆర్ఎస్ అధికార ప్రతినిధి క్రిశాంక్ సంచలన ఆరోపణలు



హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత పెట్టుబడులను ప్రకటించి ప్రజలను వంచిస్తున్నదని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి క్రిశాంక్ ధ్వజమెత్తారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో గోడాడి ఇండియా, స్వచ్ఛ్ బయో, వాల్ష్ కర్రా, ఉర్సాలాంటి సంస్థల పేరుతో అనుమానాస్పద పెట్టుబడులు ప్రకటిస్తున్నదని మండిపడ్డారు. మనకిన్ బయో సంస్థ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంసీఏ)లో కూడా రిజిస్టర్ కాలేదని పేర్కొన్నారు. ఎలాంటి నిర్దిష్ట వివరాలు లేకుండా ఒక మోసపూరిత వెబ్‌సైట్ ఈ ఏడాది మార్చి 16న సృష్టించారని ఆరోపించారు. ఆర్థిక పారదర్శకతలేని ఈ కంపెనీ రూ.340 కోట్ల పెట్టుబడి చేస్తున్నామని ప్రకటించడం అనుమానాస్పదంగా ఉందన్నారు. నష్టాలను నమోదు చేస్తున్న యెంత్రా టెక్ కంట్రోల్స్ కంపెనీ రూ.255 కోట్ల పెట్టుబడి ఎలా పెట్టగలదు..? అని క్రిశాంక్ ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంపై త్వరలో కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్తామన్నారు.


YENTRA TECH CONTROLS PRIVATE LIMITED
CIN - U74900TG2014PTC095623
Regd. Office: Ground Floor, Plot No 131, Road No 74 Jubilee Hills, Hyderabad, Telangana, India, 500033
rohit@yentra.org

DIRECTORS' REPORT

Dear Members,

Your directors have pleasure in presenting the 9th Annual Report of the Company together with the Audited Statements of Accounts for the financial year ended 31st March 2024.

1. FINANCIAL SUMMARY OR PERFORMANCE OF THE COMPANY:

The Net Financial Performance of the operations for the year are detailed herein under:

| Particulars | For the year ended 31st March 2024 (Rs) | For the year ended 31st March 2023 (Rs) |
|---|---|---|
| Total Income | - | - |
| Depreciation | 233582.43 | 159348.21 |
| Expenditure(Excluding Depreciation) | 41033 | 2968504 |
| Profit before Tax | (274615.43) | (3127852.21) |
| Current Tax | | |
| Deferred Tax | 40025.27 | 45288.26 |
| Tax of earlier Years | - | - |
| Profit/(loss) after Tax | (234590.16) | (3173140.47) |
| Earnings Per Share ( in Rs) | (23.46) | (317.31) |

2. OPERATIONS:

During the year, the company there is no turnover/revenue from operations of against the previous year.

3. TRANSFER TO RESERVES:

During the year under review the company has transferred loss amount of Rs. (234590.16) to the reserves.

4. DIVIDEND:

No dividend was declared during the period.

manakin.bio

## హైదరాబాద్‌లో ఆల్‌కార్గో గతి ఎయిర్ డెలివరీ సేవలు

ముంబై, జూన్ 10: లాజిస్టిక్, సరఫరా సేవల సంస్థ ఆల్‌కార్గో గతి లిమిటెడ్..డైరెక్ట్ ఎయిర్ సర్వీసులను మరో ఎనిమిది నగరాలకు విస్తరించింది. కేవలం 24 గంటల్లో డెలివరీ చేయడానికి ఈ ప్రత్యేక సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం ఈ సర్వీసులను హైదరాబాద్‌తోపాటు ముంబై, పుణె, కోల్‌కతా, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్ నగరాల్లో ప్రవేశపెట్టింది. దేశవ్యాప్తంగా 34 కమర్షియల్ ఎయిర్‌పోర్ట్స్‌తో అనుసంధానం కావడానికి సంస్థ..ఎయిర్ ఎక్స్‌ప్రెస్‌తో ఒప్పందాన్ని కూడా కుదుర్చుకున్నది.

## ఐపీవోకి నాలుగు సంస్థలు

న్యూఢిల్లీ, జూన్ 10: దేశీయ ఈక్విటీ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి నాలుగు సంస్థలు సిద్ధమవుతున్నాయి. వీటిలో వ్యాటర్ ప్యూరిఫైర్ కంపెనీ కెంట్ ఆర్‌వో సిస్టమ్స్‌తోపాటు కారంతర ఇంజినీరింగ్, మంగల్ ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్, విద్యా వైర్స్‌ల ఐపీవోకి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వాటాల విక్రయం ద్వారా ఈ నాలుగు సంస్థలు కనిష్ఠంగా రూ.2,500 కోట్ల నిధులను సేకరించాలనుకుంటున్నాయి.

## మున్సిపాలిటీలో విలీనం చేయొద్దు

- మున్సిపల్ కార్యాలయ సిబ్బందికి గోపన్‌పల్లి గ్రామస్తుల వినతి



బిచ్కుంద మున్సిపాలిటీ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న గోపన్‌పల్లి గ్రామస్తులు

బిచ్కుంద, జూన్ 10 : బిచ్కుంద మున్సిపాలిటీలో తమ గ్రామాన్ని విలీనం చేయవద్దంటూ మంగళవారం గోపన్‌పల్లి గ్రామస్తులు మున్సిపాలిటీకి సుమారు 50 మంది తరలి వచ్చి ఆందోళన చేపట్టారు. నూతనంగా ఏర్పాటు చేసిన బిచ్కుంద మున్సిపాలిటీలో గోపన్‌పల్లి గ్రామాన్ని విలీనం చేయడంతో మూడు నెలల క్రితం రెవెన్యూ అధికారులు గ్రామస్తుల అభిప్రాయాలు సేకరించారు. ఈ అభిప్రాయ సేకరణలో మున్సిపాలిటీలో కలవడానికి గ్రామస్తులు సుముఖత చూపలేదు. గ్రామస్తులకు తెలియకుండానే కొద్ది మంది ఫేక్ సంతకాలతో తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపడం సరైన విధానం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎక్కువ శాతం ప్రజలు కూలీపైనే ఆధార పడి జీవిస్తున్నారని, మున్సిపాలిటీలో తమ గ్రామాన్ని విలీనం చేయడంతో ఉపాధి కోల్పోవడంతో పాటు ఇబ్బందులు పడాల్సివస్తుందని, ఒక్కొక్కరూ తమ అభిప్రాయ వినతి పత్రాన్ని మున్సిపల్ సిబ్బందికి అందజేశారు. తమ గ్రామాన్ని గ్రామ పంచయతీగానే ఉంచాలన్నారు.

## అక్కంపల్లిలో తాగునీటి ఎద్దడి



అక్కంపల్లి గ్రామంలో తాగునీటి కోసం గుమిగూడిన గ్రామస్తులు

నాగిరెడ్డిపేట, జూన్ 10: మండలంలోని అక్కంపల్లి గ్రామంలో మంగళవారం తాగునీటి ఎద్దడి నెలకొన్నది. ఉదయం ట్యాంకు నుంచి నీటి సరఫరా లేకపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడ్డారు. పాఠశాల వద్ద ఉన్న సింగిల్‌ఫేజ్ మోటర్ మాత్రమే పని చేయడంతోగ్రామస్తులు బారులు తీరారు. బిందెల్లో నీటిని పట్టుకొని ఇబ్బందులు పడుతూ ఇండ్లకు తీసుకెళ్లారు. గ్రామంలోని రెండు బోరుబావుల మోటర్లు మరమ్మతులు చేయకపోవడంతో తాగునీటి ఇబ్బంది తలెత్తిందని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై గ్రామ కార్యదర్శి కిష్టయ్యను వివరణ కోరగా బోరుబావులు పని చేస్తున్నాయనీ, రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయి ట్యాంకు నిండలేదన్నారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.

# భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

కామారెడ్డి, జూన్ 10 : నవంబర్‌లోగా ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మాణం పూర్తయ్యేలా పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పంచాయతీ రాజ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన పనులను మంగళవారం పరిశీలించారు. మేస్త్రీలను, కార్మికులను ఎక్కువగా నియమించుకొని పనుల్లో వేగం పెంచి నవంబర్‌లోగా పూర్తి స్థాయిలో నిర్మాణం జరిపించాలని పంచాయతీరాజ్ డీఈ స్వామిదాస్, ఏఈ సంజయ్‌ను ఆదేశించారు. అనంతరం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోదామ్‌కు రక్షణ కల్పించాలని సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. పలు రాజకీయ నాయకులతో కలిసి ఈవీఎంసీ భద్రపరిచిన గదుల తాళాలు తెరిచి ఈవీఎంలను పొందుపరిచిన బాక్సులను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, పలు రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**రెవెన్యూ సదస్సు పరిశీలన**

బీబీపేట్(దోమకొండ), జూన్ 10 : భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన అన్ని దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. దోమకొండ మండలంలోని సంగమేశ్వర్ గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సును కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులతో మాట్లాడారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రభుత్వం భూభారతి ఆర్‌వోఆర్ చట్టం తీసుకువచ్చిందన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులు త్వరగా ఇండ్లు నిర్మించుకునేలా చూడాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా లబ్ధిదారులు ఉచితంగా ఇసుకను తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు, కార్యక్రమంలో ఆర్డీవో వీణ, మండల ప్రత్యేకాధికారిణి జ్యోతి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## రెండు బైక్‌లు ఢీ : ఇద్దరు మృతి

నస్రుల్లాబాద్, జూన్ 10 : బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామ శివారులో రెండు బైక్‌లు ఢీ కొని అన్నారం గ్రామానికి చెందిన నవీన్(18), చించెల్లి గ్రామానికి చెందిన గంగారాం (45) మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. నవీన్ అన్నారం గ్రామం నుంచి బీర్కూర్‌కు పని నిమిత్తం వెళ్తున్నాడు. గంగారాం బీర్కూర్‌లోని పెట్రోల్ బంక్ నుంచి వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్ కోసం బైక్‌పై డీజిల్ తీసుకు వస్తుండగా కిష్టాపూర్ గ్రామ శివారులో ఎదురెదుగా ఢీ కొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నవీన్ ఇటీవలే బాన్సువాడ పట్టణంలోని రేణుక ఒకేషనల్ కళాశాలలో ఎంఎల్‌టీ కోర్సు మొదటి సంవత్సరం పూర్తి చేశాడని తెలిపారు. గంగారామ్‌కు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## అప్పులోల్ల వేధింపులు భరించలేక ఆత్మహత్యా యత్నం

బిచ్కుంద, జూన్ 10 : మండలంలో వడ్డీ వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. బిచ్కుందతో పాటు గ్రామీణ ప్రాంతాల వరకు వడ్డీ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతున్నది. వడ్డీ వ్యాపారుల చేతుల్లో చిక్కి సామాన్య ప్రజలు, చిరు వ్యాపారులు ప్రాణల మీదికి తెచ్చుకుంటున్నారు. మండలంలో అప్పులోల్ల వేధింపులు భరించలేక సోమవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన చోటు చేసుకున్నది. దీంతో కుటుంబ సభ్యులు మంగళవారం బిచ్కుంద పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మాన్యాపూర గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ బిచ్కుంద పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయ దంపతుల వద్ద కొన్నేండ్లక్రితం 2లక్షల రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. దీనికి గాను 2 లక్షల 20వేల రూపాయలు వడ్డీ ఆరు నెలల క్రితం చెల్లించగా అసలు రూ.2లక్షలు ఇవ్వవలసి ఉండగా డబ్బులు లేక పోవడంతో పొలం అమ్మి ఇస్తామని తెలిపినా రుణదాత అయిన ప్రభుత్వ ఉపాధ్యాయ దంపతులు సోమవారం బాధితుడి ఇంటికి వెళ్లి ఇంటి వారందరిపై దుర్భాషలాడారు. దీంతో మనస్తాపానికి గురైన జ్ఞానేశ్వర్ గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్పందించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన బాన్సువాడ దవాఖానకు తరలించారు. బిచ్కుంద పోలీసులను ఆశ్రయించడంతో వారు దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామన్నారు.

## పెట్రోల్ పంపు ఏర్పాటుకు స్థల పరిశీలన

నాగిరెడ్డిపేట, జూన్ 10: మండలంలోని మాల్తుమ్మెద శివారులో మహిళా సమాఖ్య ద్వారా పెట్రోల్‌పంపు ఏర్పాటు కోసం మంగళవారం బాన్సువాడ సబ్ కలెక్టర్, ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీవో కిరణ్మయి స్థలాన్ని పరిశీలించారు. మండల కేంద్ర సమీపంలోని మాల్తుమ్మెద విత్తనక్షేత్రం సర్వే నెంబర్ 834లో రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. స్థలం వివరాలను తహసీల్దార్ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. వివరాలు నమోదు చేసుకున్నారు. ఆమె వెంట రెవెన్యూ, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.



బోధన్– హైదరాబాద్ రహదారిపై మాల్తుమ్మెద శివారులో పెట్రోల్ పంపు ఏర్పాటుకు స్థలం పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

## రెవెన్యూ సదస్సు సందర్శన



ఉప్పల్‌వాయి గ్రామంలో రెవెన్యూ సదస్సును సందర్శిస్తున్న రెవెన్యూ కలెక్టర్ విక్టర్

రామారెడ్డి, జూన్ 10 : మండలంలోని ఉప్పల్‌వాయి గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును రెవెన్యూ కలెక్టర్ విక్టర్ సందర్శించారు. వచ్చిన దరఖాస్తుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ప్రజల వద్ద నుంచి వస్తున్న దరఖాస్తులను స్వీకరించి, విచారణ అనంతరం వారి సమస్యకు మార్గం చూపాలని సూచించారు. ఆయనవెంట తహసీల్దార్ ఉమలత, ఆర్ఐ రవికాంత్, అధికారులు ఉన్నారు.

**దరఖాస్తు చేసుకోవాలి**

బీబీపేట్, జూన్ 10 : మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో ఎలాంటి భూ సమస్యలు ఉన్నా రెవెన్యూ సదస్సులో ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ గంగాసాగర్ అన్నారు, బీబీపేటలోని రైతువేదికలో రెవెన్యూ సదస్సు నిర్వహించి భూ సమస్యలు ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ రాము, జూనియర్ అసిస్టెంట్ ముదాం చిరంజీవి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మోడల్ ఇండ్ల పరిశీలన



ఇల్లు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

పెద్దకొడప్‌గల్, జూన్ 10 : మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్, జడ్పీ సీఈవో చందర్ నాయక్ సందర్శించారు. ఇందిరమ్మ న మూనా ఇండ్లు, ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో ఇంకుడు గుంతలు, మోటర్ రీచార్జ్, ఇందిరమ్మ ఇండ్లు, ఏకరూప దుస్తులు తదితర విషయాలపై అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆయనవెంట ఎంపీవో కిషన్, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి, ఏపీవో సుదర్శన్ తదితరులు ఉన్నారు.

# క్రీడా ప్రాంగణానికి తాళం



క్రీడా ప్రాంగణములో పెరిగిన పిచ్చి మొక్కలు

కామారెడ్డి, జూన్ 10 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రతి కాలనీలో పార్క్, క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. కాలనీ వాసులకు దగ్గరలో ఉండడానికి, చిన్నారులు ఎక్కడనో కాకుండా ఇంటికి దగ్గరలోనే ఆడుకోవడానికి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. కామారెడ్డి మున్సిపల్‌లో పాలకవర్గం లేకపోవడంతో అధికారులకు అడిగేవారు లేక పట్టణంలోని పలు క్రీడా ప్రాంగణాలు, పారిశుద్ధ్యాన్ని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ వెనుకభాగంలో ఉన్న తెలంగాణ క్రీడా ప్రాంగణానికి తాళం వేశారు. అక్కడికి వెళ్లేవారు లేకపోవడంతో క్రీడా ప్రాంగణంలో పిచ్చి మొక్కలు పెరిగాయి. రానున్నది వర్షాకాలం కావడంతో అక్కడ పాములు వచ్చే అవకాశాలు ఉన్నాయని కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఈ క్రీడాప్రాంగణాన్ని శుభ్రం చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. దీనిపై కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డిని ఫోన్ ద్వారా సంప్రదించగా ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదని త్వరలోనే మున్సిపల్ కార్మికులతో శుభ్రం చేయిస్తానని తెలిపారు.